ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడి రాజీనామా

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు దూళిపాల సీతారం తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. తన వ్యక్తిగత కారణంగా రాజీనామా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇన్ని రోజుల పాటు సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ వర్ధంతి



పలుగు చెరువు మహేష్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ చౌరస్తాలో బాబా సాహేబ్ డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ 67వ వర్ధంతిని ఈనెల 6న ఉదయం 9 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పలుగు చెరువు మహేష్, శ్రీనివాస్‌లు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వర్షాలతో రైతుల్లో ఆందోళన

- తుఫాన్ ప్రభావంతో వరికోతలకు ఆటంకం..
- ధాన్యం ఆరబోతకు ఇబ్బందులు



మండలంలోని కేబీ.దొడ్డి వద్ద కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట

శంషాబాద్ రూరల్: తుఫాన్ ప్రభావంతో గత రెండు రోజులుగా వాతావరణం చల్ల బడడంతో పాటు జల్లులు కురుస్తున్నాయి. వరి కోతలు మొదలైన సమయంలో కురుస్తున్న వానలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వర్షాలతో వరి కోతలకు ఆటంకాలు ఎదురుకావడంతో పాటు ధాన్యం ఆరబెట్టేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు ఈ ఖరీఫ్‌లో 5400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 15 రోజుల నుంచి వరి కోతలు మొదలుపెట్టగా...ఈ సమయంలో తుఫాన్ ప్రభావంతో పంట నేలకొరిగి నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన సాగు విస్తీర్ణం..

మండలంలో గత ఏడాది కంటే ఈ ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వర్షాలు ఆశాజనకంగా ఉండడంతో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీళ్లు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రైతులు ఎక్కువగా వరి సాగుపై దృష్టి పెట్టారు. గత ఏడాది 4500 ఎకరాల్లో వరి పండించారు. సాధారణంగా రైతులు ఈ ప్రాంతంలో వరితో పాటు వర్షాధార పంటలకు తోడు కూరగాయాలు, పూలు పండిస్తారు. పెట్టుబడి వ్యయం పెరగడం, కూలీల కొరత, గిట్టుబాటు ధరలు లేని కారణంగా ఈ సారి రైతులు వరి సాగు చేపట్టారు. అయితే కోతల సమయంలో వర్షాలు రావడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

తడారని పొలాలు...

ఎర్రమట్టి నేలలు మినహా చాలా చోట్ల వరి చేను పొలాలు ఇంకా తడారలేదు. కూలీల కొరత కారణంగా రైతులు పూర్తిగా వరి కోత మిషన్లపై ఆధారపడ్డారు. చేన్లు తడిగా ఉండడంతో వరి కోతలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. మల్కారం, సుల్తాన్‌పల్లి, కవేలిగూడ, ననాజీపూర్, రామంజాపూర్, కేబీ.దొడ్డి, తదితర గ్రామాల్లో వరి కోతలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీనికి తోడు వర్షానికి తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి సరైన వసతులు లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నాల్గోసారి విజయకేతనంతో ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యేను సన్మానించిన కౌన్సిలర్ వై. కుమార్ తదితరులు

శంషాబాద్: నాల్గోసారి విజయకేతనం ఎగురవేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ ఆ పార్టీ బీఆర్ఎస్ నేతలు ఘనంగా సన్మానించారు. ఆరోవార్డు కౌన్సిలర్ వై. కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్యకర్తల సమష్టి కృషితోనే తనకు విజయం సొంతమైందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు డి. వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్. గణేష్‌గుప్తా తదితరులున్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



సాంబశివరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

మణికొండ: కొత్తగూడెం ఎమ్మెల్యేగా గెలిచిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కోణంనేని సాంబశివరావును జిల్లా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగ్‌రావు, ఏఐటీయుసీ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, జిల్లా కార్యదర్శి ఎస్. మల్లేష్‌లు ఆయనను కలిసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు ప్రజా సమస్యల పరిష్కారం కొరకు అసెంబ్లీలో ప్రజల గొంతుకగా కృషి చేయాలని కోరామన్నారు.

నేడు అయ్యప్ప మహాపడి పూజ

మణికొండ: మణికొండ మున్సిపాలిటీ కేంద్రం సుందర్‌గార్డన్ పక్కన బుధవారం ఉదయం 9.30గంటలకు అయ్యప్పస్వామి మహాపడి పూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి డి.అర్జున్ తెలిపారు. గురుస్వామి మున్నుస్వామి నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించే మహాపడిపూజ సందర్భంగా గౌరీనందన్ భక్త సమాజం, కపిల్ మద్దూరి భజన, శివాజీనగర్ కాలనీ అయ్యప్ప సేవా సన్నిదానం స్వాములతో అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయనకోరారు.

నియజకవర్గం ప్రజలకు రుణపడి ఉంటా: ఎమ్మెల్యే



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు అభినందనలు తెలుపుతున్న జయప్రకాష్ గురుస్వామి బృందం

మైలార్‌దేవ్‌పల్లి: నన్ను గెలిపించిన ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి ప్రకాష్‌గౌడ్ అన్నారు. మంగళవారం అయ్యప్ప సేవాసమితి నుంచి సంకూరి జయప్రకాష్ గురుస్వామి బృందం ఎమ్మెల్యే నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ప్రజలు ఆదరిస్తూ నాలుగు సార్లు నా విజయానికి భాటలు వేశారని అన్నారు. ప్రజలకు ఎల్ల వేళల అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల్లో కష్టపడి పని చేసిన సంకూరి జయప్రకాష్ బృంధానికి కృతజ్ఞతలు తెలిపారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన



సాన్నెం శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం అధికారికంగా ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సాన్నెం శ్రీనివాస్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు మంచి పాలనను అందిస్తారన్నారు. ప్రజలకు మంచి రోజులు వచ్చాయని, అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. సామాన్యులకు ప్రజా పాలన అందుబాటులోకి వచ్చిందన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మణికొండ: విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ గోల్డన్ టెంపుల్ సమీపంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వికారాబాద్ జిల్లా బొంరాస్‌పేట్ మండల కేంద్రానికి చెందిన జి. అశోక్ లవ్లీ హాట్ చిప్స్ షాపులో పనిచేస్తున్నాడు. మంగళవారం వర్షం కురవటంతో చిప్స్ షాప్ పైన ఫ్లెక్సీని కట్టుకుని చిప్స్ తయారీ చేస్తున్నాడు. అదే సమయంలో విద్యుత్ తీగలు ఫ్లెక్సీకి తగలటం, అది అతనికి తగలటంతో ప్రమాదం జరిగింది. అతన్ని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు డాక్టర్ నిర్ధారించారు. తల్లి కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

శివసాయి క్షేత్రంలో రుద్ర హోమం

రాయదుర్గం: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో కాశీ విశ్వేశ్వరుడికి అభిషేకం చేశారు. అనంతరం రుద్రాక్షలతో అలంకారం చేశారు. భక్తులకు దర్శనం కల్పించారు. అంతకుముందు నిర్వహించిన రుద్రహోమం పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదబ్రాహ్మణులు మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

ఎమ్మెల్యేను సన్మానించిన నాయకులు



ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టీ. ప్రకాష్‌గౌడ్ 4వసారి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా మంగళవారం బండ్లగూడ జాగీరు కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో మరింత ప్రజా సేవ చేసి మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సంతోషిరాజిరెడ్డి, సీనియర్ నాయకులు యాదిరెడ్డి, రాజిరెడ్డి, లక్ష్మారెడ్డి, ధశరథ్, భూపాల్‌రెడ్డి, సందీప్‌కుమార్, వెంకట్‌రెడ్డి, మహిళలు లలిత, రాజ్యశ్రీ, కుమారి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపుతో ప్రత్యేక పూజలు

బండ్లగూడ: రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే టీ.ప్రకాష్‌గౌడ్ 4వసారి విజయం సాధించడంతో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు మొక్కులు తీర్చుకున్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కిస్మత్‌పూర్‌లోని హనుమాన్ దేవాలయంలో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ గెలిచిన సందర్భంగా 18వ డివిజన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతసురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, యాదగిరి, గణేష్‌యాదవ్, ప్రవీణ్‌గౌడ్, సంతోష్‌గౌడ్, సందీప్, సాయి, సృజన్, బాలు, సిద్ధుయాదవ్, గౌతమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కిష్మత్‌పూర్ హనుమాన్ దేవాలయంలో 101 కొబ్బరికాయలు కొట్టిన నాయకులు

ఆర్థిక సాయం అందజేత



బాలుడి తల్లిదండ్రులకు ఆర్థిక సహాయం చేస్తున్న స్థానికులు

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని టీఎన్జీవోస్ కాలనీలో నివసించే రోషన్‌కుమార్, ప్రియాంకలు దంపతులకు క్రిష్ణకుమార్ (4)బాలుడు ఉన్నాడు. ఈనెల 17వ తేదీన తోటి స్నేహితులతో ఆడుకుంటూ ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కి వైర్లను తాకడంతో బాలుడు విద్యుత్ ఘాతాన్కి గురైయ్యాడు. ఆరోజు నుంచి ఇప్పటి వరకు ఉస్మానియా దవాఖానలో ప్రాణాలతో కొట్టు మిట్టాడుతున్నాడు. ఆ కుటుంబానికి మధుబన్‌కాలనీ, టీఎన్జీవోస్ కాలనీ, పద్మశాలిపురం స్థానికులు ,ప్రశాంత్ గౌడ్ , శ్రీనివాస్‌గౌడ్ , కొండల్ ముదిరాజ్ ,రామక్రిష్ణరెడ్డి, సాకలి బాలయ్య, నిఖిల్ రెడ్డి ల ఆధ్వర్యంలో చందా రూపంలో రూ. 1,01500 బాలుడు తల్లిందండ్రులకు అందజేశారు.

ఉర్సు ఉత్సవాల్లో యువకుడి పై దాడి

అత్తాపూర్: జలాల్‌బాబానగర్ జరిగిన ఉర్సు ఉత్సవాల్లో యువకుల మధ్య జరిగిన గొడవలో ఓ యువకుడు గాయాలకు గురైన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై లింగం తెలిపిన వివరాల ప్రకారం...జలాల్‌బాబానగర్ ప్రాంతానికి చెందిన యువకులు ఉర్సు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సంబరాల్లో పాల్గొని డ్యాన్స్ చేస్తుండగా దావూద్, సోహేబ్ (18)లు ఒకరినొకరు గొడవ పడ్డారు. దీంతో కోపోద్రేక్తుడైన దావూద్ సోహేబ్‌పై బ్లేడ్‌తో దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో సోహేబ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీ రామక్రిష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్



పాఠశాలలోని విద్యార్థులకు వివేకానంద పుస్తకాలను అందజేస్తున్న బొల్ల శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి: శ్రీ రామక్రిష్ణ సేవా సమితి పద్మశాలిపురం వారి ఆధ్వర్యంలో గత పది సంవత్సరాలుగా నిర్వహిస్తున్న వివేకనంద టాలెంట్ టెస్టును ఈ సంవత్సరం కూడా నిర్వహిస్తున్నట్లు శ్రీరామక్రిష్ణ సేవా సమితి నిర్వాహకులు పేర్కొన్నారు. స్వామి వివేకానంద, రామక్రిష్ణ మఠాన్ని స్థాపించి 125 సంవత్సరాలు పూరైనా సందర్భంగా స్వామి వివేకానంద స్ఫూర్తిని విద్యార్థులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో రామక్రిష్ణ మిషన్ (సాధుసంఘఆవిర్భావ గాధ)అనే పుస్తకంపై ఈ టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ నెల 16వ తేదీన రాజేంద్రనగర్ సర్కిల్‌లోని 30ప్రైవేట్ పాఠశాలలో ఈ టెస్టును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ టాలెంట్ టెస్టులో గెలుపొందిన విద్యార్థులకు జనవరి 12వ తేదీన బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి-12500. రెండవ బహుమతి 7500. మూడవ బహుమతి 5000. ప్రతి ఒక్కరికి 1000 రూపాయలు ప్రోత్సాహక బహుమతి అందిస్తున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ కనక దుర్గ నృత్య విభావరి ఆధ్వర్యంలో భారత నాట్య ప్రదర్శన పేరిట మంగళవారం కళావేదికపై నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ప్రముఖ నృత్య గురువు నిర్మల ప్రభాకర్ నిర్వహణలో 40 మంది చిన్నారులు పలు అంశాలపై చక్కటి హావాభావాలతో చేసిన నృత్యాలు సమ్మోహన పరిచాయి. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ..పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి శాస్త్రీయ కళలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంగీత గురువు ఎస్.సువర్ణలత, జి.వెంకట్‌రెడ్డి, కుసుమ బోగరాజు, శ్రీవల్లి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

‘పల్లెల్లో వికసించిన కమలం’

- మండలంలో బీఆర్ఎస్ కంటే 222 ఓట్ల ఆధిక్యంలో బీజేపీ
- మూడో స్థానంలో కాంగ్రెస్

శంషాబాద్ రూరల్: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కమలం పార్టీకి గ్రామీణులు జై కొట్టారు. మండలంలో ఓటింగ్‌ను పరిశీలిస్తే బీఆర్ఎస్ కంటే బీజేపీ 222 ఓట్ల ఆధిక్యతను సొంతం చేసుకుంది. ఈ ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రకాష్‌గౌడ్ గెలిచినా.. మండలంలో ఆ పార్టీకి వచ్చిన ఓట్లు నిరాశజనకంగానే ఉన్నాయని చెప్పవచ్చు. గతంలో మాదిరిగా నియోజకవర్గంలో శంషాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి ఆధిక్యత వస్తుందని ఆ పార్టీ నాయకులు భావించినా.. చివరకు ఓటింగ్‌ను పరిశీలిస్తే పార్టీకి గ్రామీణ ప్రజల్లో నెలకొన్న అసంతృప్తి ఎలా ఉందో బయటపడింది.

మూడు పార్టీలు పోటాపోటీగా..

- ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీగా ఓట్లను కొల్లగొట్టాయి. మండలంలో 27 పంచాయతీల్లో నమోదైన ఓట్లలో బీజేపీ 11,668 ఓట్లు సాధించగా.. బీఆర్ఎస్‌కు 11,446 ఓట్లు నమోదయ్యాయి. ఇక 8,696 ఓట్లతో కాంగ్రెస్ మూడో స్థానంలో నిలిచింది.

మేజర్ పంచాయతీల్లో..

- మండలంలో నర్కూడ, పెద్దషాపూర్, పాల్మాకుల మేజర్ పంచాయతీల్లో ఫలితాలు ఆసక్తికరంగా మారాయి. పెద్దషాపూర్‌లో మాజీ ఎంపీపీ, ప్రస్తుత ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య, సర్పంచ్ చంద్రశేఖర్.. వీరిద్దరూ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌కు సమీప బంధువులు కావడంతో ఆ పార్టీ తరపున విస్తృత ప్రచారం నిర్వహించారు.
- పెద్దషాపూర్, పెద్దషాపూర్‌తండా పరిధిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ సాగింది. బీఆర్ఎస్‌కు 1336 ఓట్లు రాగా.. కాంగ్రెస్ రెండు ఓట్ల ఆధిక్యతతో 1338 ఓట్లు సాధించింది. ఇక్కడ బీజేపీ కేవలం 708 ఓట్లతో సరిపెట్టుకుంది.
- పాల్మాకులలో కూడా కాంగ్రెస్ ఆధిక్యతను కనబర్చింది. బీఆర్ఎస్‌కు 1248 ఓట్లు రాగా.. కాంగ్రెస్‌కు 1324 ఓట్లు నమోదు చేసి 76 ఓట్ల ఆధిక్యతను చూపించింది. ఇక్కడ బీజేపీ 1091 ఓట్లతో మూడో స్థానంలో నిలిచింది.
- నర్కూడలో బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీ నెలకొంది. ఇక్కడ బీఆర్ఎస్ 1441 ఓట్లు సాధించగా.. బీజేపీకి 1217 ఓట్లు వచ్చాయి. 973 ఓట్లతో కాంగ్రెస్ మూడోస్థానంలో ఉంది. బీఆర్ఎస్‌కు 224 ఓట్ల ఆధిక్యత దక్కింది.

అంచనాలు తారుమారు..

- బీఆర్ఎస్ పార్టీ నాయకుల అంచనాలు మండలంలో పూర్తిగా తారుమారయ్యాయి. చాలా పంచాయతీల్లో ఈ పార్టీ సర్పంచులు అధికారంలో ఉన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్‌కి బీజేపీ, కాంగ్రెస్ నుంచి గట్టి పోటీ ఎదురైంది. బీజేపీ అత్యధికంగా ముచ్చింతల్‌లో 343, రామంజాపూర్‌లో 326 ఓట్లు, పెద్దగోల్కొండలో 232 ఓట్లు, బహదూర్‌గూడలో 176 ఓట్ల ఆధిక్యతను కనబర్చింది.
- శంకరాపురంలో సైతం బీజేపీ 119 ఓట్లు, మల్కారంలో 51 ఓట్ల ఆధిక్యత సాధించగా.. ఈ రెండు చోట్ల బీఆర్ఎస్ మూడో స్థానంలోకి వెళ్లింది.
- కవ్వగూడలో సైతం బీజేపీ 58 ఓట్ల ఆధిక్యత సాధించింది. ఇక్కడ బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు చెరి సమానంగా 438 ఓట్లు రావడం విశేషం. సంఘీగూడలో 164 ఓట్లు, హమీదుల్లానగర్‌లో కూడా బీజేపీకి 56 ఓట్ల మెజార్టీ వచ్చింది. మదన్‌పల్లిలో సైతం బీజేపీ 9 ఓట్ల ఆధిక్యత చూపింది.
- రామంజాపూర్‌లో బీజేపీకి 764 ఓట్లు, బీఆర్ఎస్‌కు 438 ఓట్లు, కాంగ్రెస్‌కు 348 ఓట్లు వచ్చాయి.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఎదురుగాలి..

- మండలంలో మొదటి నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు మంచి పట్టు ఉంది. కాంగ్రెస్ నుంచి సీనియర్ నాయకులు కొంత మంది బీఆర్ఎస్‌లో చేరడం.. మరికొంత మంది తటస్థంగా ఉండటంతో పార్టీకి పూర్వ వైభవం కోసం ఈ ఎన్నికల్లో నాయకులు సర్వశక్తులు ఒడ్డారు. ముఖ్యంగా మాజీ ఎంపీపీ, పెద్దషాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య, సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం చాలా కృషి చేశారు.
- మండలంలో బీఆర్ఎస్ పార్టీ అత్యధికంగా కాచారంలో 218 ఓట్లు, నర్కూడలో 224 ఓట్లు, సుల్తాన్‌పల్లిలో 94 ఓట్లు, పెద్దతూప్రలో 64 ఓట్లు, చిన్నగోల్కొండలో 73 ఓట్లు, చౌదరిగూడలో 52 ఓట్లు, రషీద్‌గూడలో 41 ఓట్లు, జూకల్‌లో 6 ఓట్లు ఆధిక్యత చూపించింది. మరో వైపు కాంగ్రెస్ పార్టీ ఘాంసిమియాగూడలో 72 ఓట్లు, గండిగూడలో 61 ఓట్లు, ఆధిక్యతను కనబరిచింది.

గోల్కొండ ఆస్పత్రి అభివృద్ధికి కృషి



కార్వాన్ ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గోల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్య బృందం

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తానని కార్వాన్ ఎమ్మెల్యేగా మరోసారి ఎన్నికైన కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సందర్భంగా గొల్కొండ ఏరియా ఆస్పత్రి వైద్య బృందం మంగళవారం ఆయనను సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లుగా తాను ఎమ్మెల్యేగా ఉన్నానని ఆస్పత్రికి ఎంపీ అసదుద్దీన్ ఒవైసీతో పాటు అధికారుల సహకారంతో ఎంతగానో అభివృద్ధి చేయించానన్నారు. ఆస్పత్రి నూతన బ్లాక్ నిర్మాణానికి గత ప్రభుత్వ ఆరోగ్య మంత్రి నాలుగు కోట్ల రూపాయలు కేటాయించారని ఆ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. రానున్న ఐదేళ్లల్లో అందరికీ అందుబాటులో ఉంటూ మరింత నిబద్ధతతో ప్రజా సేవా చేస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మహ్మద్ మహజర్‌ఉల్లా, ఇన్‌చార్జి ఆర్ఎంఓ డాక్టర్ ఏ.శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

లక్ష్య ఛేదనలో ఆరోగ్యం ఎంతో ముఖ్యం

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే వారు ఎంచుకున్న లక్ష్యాలను సాధించడంతోపాటు సమాజానికి సేవ చేయగలరని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడితో కూడిన జీవితాన్ని గడుపుతున్నారని, దీంతో బీపీ, షుగర్‌ల తోపాటు గుండె సంబంధ సమస్యలు వస్తున్నాయన్నారు.శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, ఎముక సాంద్రత పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్ లక్ష్మీకాంతరావు, ప్రిన్సిపల్ జగన్మోహన్‌రెడ్డిలతోపాటు అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి వైద్యబృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు నాసా కిట్ల పంపిణీ

గోల్కొండ: విద్యార్థులకు అన్ని రంగాల్లో ప్రోత్సహించి వారి భవిష్యత్తును ఉజ్వలంగా మార్చేందుకు తమ పాఠశాల కృషి చేస్తుందని శ్రీ చైతన్య స్కూల్ మెహిదీపట్నం జోన్ ఏజీఎం బి.కృష్ణ అన్నారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు నాసా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అంతరిక్ష విషయాలపై విద్యార్థులకు మరింత ఆసక్తి కలిగించేలా వారిని ప్రోత్సహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నాసా కిట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆర్ఐ హరికృష్ణ, ప్రిన్సిపల్ స్వాతి, అకాడామిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ ఓంకార్, అసిస్టెంట్ డీన్ ఆంజనేయులు, ఇన్‌చార్జి నదీమ్, నాసా ఇన్‌చార్జి ఏజాజ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం



గోల్కొండ: మాజీ మంత్రి, మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైన తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా తలసానిని సన్మానించారు. తలసాని మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ప్రతిపక్షంలో ఉంటూ తాము ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన అన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తికి జైలు

గౌలిపుర: పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన కేసులో ఓ వ్యక్తికి నాంపల్లి లోని స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్ట్ మెజిస్ట్రేట్ మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ఇన్‌స్పెక్టర్ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం..భవానీనగర్ తలాబ్ కట్ట ప్రాంతానికి చెందిన ఓబైద్ బిన్ సలాం (43) ఈనెల 3న ఎన్నికల ఫలితాల సందర్భంగా స్థానికంగా సౌండ్ బాక్సులు పెట్టి న్యూసెన్స్ సృష్టించాడు. పోలీసులు సౌండ్ బాక్స్‌లను ఆపాలని సూచించడంతో దురుసుగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాం అరెస్టు చేసి మంగళవారం నాంపల్లిలోని నాలుగో స్పెషల్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా..మెజిస్ట్రేట్ సత్యనారాయణ నిందితునికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో పోలీసులు ఓబైద్ బిన్ సలాంను చంచలగూడ జైలుకు తరలించారు.